ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 25 | సంచిక : 10 | జూన్ 2020

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ఈ సంచికలో....

30-12-1984, జిన్నూరు

అరుణాచల మహత్యం

శ్రీమద్భగవద్గీత

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## గౌతమ బుద్ధుడు



**బుద్ధుడి గురించి చెప్పినప్పుడు "ది మోస్ట్ సివిలైజ్డ్ మాన్ ఆన్ ఎర్త్" (ప్రపంచంలో అందరికంటే సంస్కారవంతుడు) అనే వారు శ్రీ నాన్నగారు. గౌతమ బుద్ధుడు జీవితం, ఆయన వైభవం, గురించి శ్రీ నాన్నగారు వివిధ సందర్భాలలో చెప్పిన కొన్ని విషయాలు . . .**

బుద్ధుడు వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు జన్మించాడు; పౌర్ణమి నాడు నిర్వాణ స్థితి పొందాడు; పౌర్ణమి నాడు బోధ మొదలు పెట్టాడు; పౌర్ణమి నాడు శరీరం వదిలి పెట్టాడు.

గౌతమ బుద్ధుడి తండ్రి శుద్ధోధనుడు మహాచక్రవర్తి. బుద్ధుడు జన్మించినప్పుడు జ్యోతిష్కులు అయితే ఇతడు మహారాజు లేదా మహాసన్యాసి అవుతాడు అని చెప్పారు. అందుకే బయటికి పంపకుండా, ప్రపంచం తెలియకుండా పెంచాడు తండ్రి. వేసవికాలంలో ఉండటానికి ఒక మేడ, శీతాకాలంలో ఉండటానికి ఒక మేడ, వర్షాకాలంలో ఉండటానికి ఒక మేడ, కట్టించాడు గౌతమబుద్ధుడి కోసం. అంటే ఏ పనీ చెయ్యక్కరలేదు, రాజ్యాన్ని కూడా పరిపాలించ నక్కరలేదు, మనిషి కళ్ళతోటి చూసుకోవటానికి ఎదురుగా ఉంటే చాలు అనుకున్నాడు తండ్రి!

అనుకోకుండా ఒక రోజు రాజ్యంలో తిరుగుతూ ఉంటే, ఒక శవం ఎదురు వస్తుంది. అది ఏమిటి అని అడిగాడు. అది శవం, మనం కూడా అలాగే చచ్చిపోతాము అంటాడు రథసారథి. కొంత దూరం వెళ్ళాక రోగిష్టి వాడు, ముసలి వాడు ఎదురు అవుతారు.

అదేమిటి అంటే, మనం కూడా అంతే, మనకి కూడా మూడవ కాలు(కర్ర) వచ్చేస్తుంది అన్నాడు సారథి. అప్పటివరకూ ప్రతీ మనిషి యవ్వనంతో సంతోషం గానే ఉండిపోతాడు అనుకునేవాడు. మనం కూడా అంతేనా అనుకున్నాడు బుద్ధుడు. ఇంటికి తిరిగి వచ్చాక కూడా వాళ్ళు ముగ్గురూ అస్తమానూ జ్ఞాపకం వస్తున్నారు. మానవ జాతికి దుఃఖం, సఫరింగ్ ఎలా తగ్గుతుంది అని ఆలోచన మొదలుపెట్టాడు.

ప్రపంచంలో సారో, సఫరింగ్ ఆర్పటానికే ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోదామని ప్రయాణం అయ్యాడు. ఈ ప్రపంచాన్ని లోకాన్ని ఉద్ధరించటానికి బయలుదేరుతున్నాడు. గౌతమ బుద్ధుడు ఇల్లు విడిచిపెట్టిన టైము రాత్రి; పగలు వెళ్ళలేదు, ఆయన మహా చక్రవర్తి కదా. భార్య యశోధర చాలా మంచిది. అప్పటికి 6 నెలల కొడుకు కూడా ఉన్నాడు. రాత్రి 12 గంటలకి బయలుదేరాడు; అది మహా నిష్క్రమణం. ఒక్కసారి కొడుకుని చూడాలి అనిపించింది. భార్య కొడుకు పడుకొని ఉన్న గది తలుపు తీసి, వాళ్ళ వంక ప్రశాంతంగా 5 నిమిషాలు చూసాడు. అప్పుడు బుద్ధుడు అనుకుంటాడు, ఇది కూడా ఒక ఆటంకం, చూడాలన్న తలంపు కూడా ఒక ఆటంకమే కదా. తలుపు దగ్గరగా వేసి వెనక్కి వచ్చేసాడు, రాజ్యాన్ని విడిచిపెట్టి వెళ్ళాడు. ప్రేమలేని మనిషి అనుకోకూడదు. ప్రేమని వైడెన్ (విశాలం) చేస్తున్నాడు ప్రపంచం కోసం. ఈ ప్రపంచాన్ని తన ఇల్లుగా చేసుకున్నాడు. ఈ ప్రపంచాన్ని ఉద్ధరించటానికి వెళ్ళాడు.

తీవ్రమైనసాధనలు చేస్తూ, ఆహారం పూర్తిగా మానేసాడు కొంతకాలం. ఆహారం లేకపోతే శరీరం పడిపోతుంది అనే నిర్ణయానికి వచ్చాడు. సుజాత అనే ఆవిడ పిల్లలు లేరని రావి చెట్టు చుట్టూ తిరిగి పాయసం నైవేద్యం పెట్టడానికి వచ్చింది. మనిషి ఒకడు ఉండగా చెట్టుకి ఎందుకని బుద్ధుడికి పెట్టింది ఆ పాయసం. ఆయన కూడా ఉన్న ఐదుగురు శిష్యులు అది చూసారు. ఏదో బోధిస్తాడని ఎదురు చూస్తున్నారు. స్త్రీ చేతి పాయసం తాగాడు అని కోపగించుకొని వెళ్ళిపోయారు.

బుద్ధుడు నిర్వాణ స్థితి పొందాక, ఆ స్థితిలో కొద్ది రోజులు ఉండిపోయాడు. అప్పటిదాకా బోధించాలి అనే స్ఫురణే లేదు. 48 రోజులు తరువాత అంతర్వాణి ప్రబోధించగా బోధించటానికి ఉపక్రమించాడు. బోధించాలి అనే నిర్ణయానికి వచ్చాక, ఆఐదుగురు కోపంతో వెళ్ళిపోయినా సరే, ఎక్కడ ఉన్నారో దివ్యదృష్టితో చూసి సారనాథ్ లో ఉన్నారని గ్రహించాడు. సారనాథ్ నడిచి వెళ్లి వాళ్లకి బోధించాడు, అదే మొదటి టీచింగ్. ఆయన మధ్యే మార్గం బోధించాడు. ఆహారం నిద్ర ఎక్కువ వద్దు, పూర్తిగా మానవద్దు అన్నాడు. కుటుంబం తోటి, సమాజం తోటి అతిగా ఉండవద్దు. ఎవరో వచ్చి బాగు చేస్తారని ఎదురు చూడవద్దు. నువ్వు బాగుపడే మార్గం చూసుకో. డివైన్ ఇంటర్ఫియరన్స్ వస్తే తీసుకో, వస్తుందని ఎదురుచూడవద్దు.

బుద్ధుడు తను పొందినది నిర్వాణసుఖం అంటాడు. నిర్వాణం అంటే ఆరిపోవటం. నీకున్న దేహ బుద్ధి శవబుద్ధి శేషం లేకుండా ఆరిపోవటం. అప్పుడు కానీ నిర్వాణసుఖం రాదు. నేను ఫలానా అనుకుంటే నిర్వాణసుఖం రాదు. నేను నాది అనే తలంపు లేదు బుద్ధుడికి, పునర్జన్మ హేతువులు లేవు, కంప్లీట్ గా ఆరిపోయాయి.

బుద్ధుడు హోంలెస్, పెన్నీలెస్; ఆయనకు ఆశ్రమం ఏమీ లేదు. ఆయనది ఒకటే పాలసీ - నతింగ్ ఫర్ మి - ఇది నాది అని ఎప్పుడూ అనుకోలేదు. కొడుకుకీ, పినతల్లికీ, సవితి తమ్ముడికీ కూడా సన్యాసం ఇచ్చేసాడు. రాజ్యానికి వారసులు లేకుండా చేసేసాడు. ప్రపంచ చరిత్ర లో ఇటువంటిది లేదు.

బుద్ధుడు చాలా మర్యాదస్థుడు. వాయిస్ పెంచడు. నీకు అర్థం అవ్వకపోతే మౌనంగా ఊరుకుంటాడు. మనకి సాధ్యం కాదు అలా మాట్లాడటం. ఆయన5 నిమిషాలు మాట్లాడితే, మొదటి సెంటెన్స్ ఎలా ఉంటుందో, చివరి సెంటెన్స్ కూడా అలాగే ఉంటుంది.

ఒక్క బలహీనత కూడా లేని వాడు బుద్ధుడు. ఒక కులం, ప్రాంతం, దేశం, రంగు, లింగభేదం ఏమీ కనపడవు. మనం బుద్ధుడిలో ఏమైనా బలహీనతలు పట్టుకోవాలి అనుకుంటే బుద్ధుడి మైండ్ లో ఏమీ కనపడదు, అక్కడ ఏమీ ఉండదు. మనకి ఎక్కడైనా ఇష్టం అయిష్టం ఉంటే అది బ్రెయిన్‌లో వెదికితే కనిపిస్తుంది. బుద్ధుడి బ్రెయిన్ లో చెయ్యిపెట్టి వెదికినా ఇష్టాఅయిష్టాలు కనిపించవు.

ఎవరి సహాయం లేకుండానే, నిన్ను సారో లోంచి, సఫరింగ్ లోంచి బయటికి తీసుకొని రావాలి. నీ అంతట నువ్వే రావాలి. ఎవరో వచ్చి బాగుచేస్తారని కనిపెట్టుకొని ఉండకు అంటాడు బుద్ధుడు.

నాకు మళ్ళీ జన్మ వస్తుందా అంటే నీకు మళ్ళీ జన్మ వస్తుందో రాదో నీకే తెలుస్తుంది. నమ్మకం మీద కాదు, ఫేక్ట్ (యదార్థం) మీద ఆధారపడాలి అంటాడు బుద్ధుడు. మళ్ళీ శరీరం వస్తుందా అంటే, శరీరం తోటి పని ఉంటే వస్తుంది. నీకు బాడీ తోటి పని ఉందో లేదో నాకు ఎలా తెలుస్తుంది? అవసరం లేకపోతే రాదు, అవసరం ఉంటే వద్దన్నా వచ్చేస్తుంది. దాని గురించి తలకాయ పాడు చేసుకోవటం అనవసరం అంటాడు. ప్రతీదీ ప్రాక్టికల్. ఇండివిజ్యువల్ కనిపిస్తే, వ్యక్తి కనిపిస్తే, లిబర్టీ వచ్చేస్తుంది.

అంగుళీమాలుడు అనే కిరాతకుడు మనుషులని దోచుకొని, చంపేసి, బొటనవేలును నరికి మెడలో మాలగా వేసుకునేవాడు. బుద్ధుడు ఆ అడివిమార్గంలో వెళ్తుంటే ఆగు ఆగు అంటాడు అంగుళీమాలుడు. బుద్ధుడు ప్రశాంతంగా వెనక్కి తిరిగి చూసాడు. నేను ఎప్పుడో ఆగిపోయాను. ఆగవలసింది నువ్వే కాని నేను కాదు అన్నాడు. బుద్ధుడి మైండ్ ఎప్పుడో ఆగిపోయింది, ఆరిపోయింది; అక్కడ ఉన్నది నో మైండ్ స్టేట్. వాడుచంపటానికి దగ్గరకు

వచ్చాడు. ప్రశాంతంగా వాడికేసి చూసాడు బుద్ధుడు. అంగుళీమాలుడికి సడన్‌గా చంపాలి అనే తలంపు పోయింది, నార్మల్ అయిపోయాడు. అంగుళీమాలా అంటూ ప్రియంగా పిలిచి, నన్ను ఆగమంటున్నావు కాని నేను ఆగిపోయే ఉన్నాను. ఆగవలసింది నువ్వు. ఇందులో గొప్ప ఫిలాసఫీ ఉంది. మైండ్ లేని వాడికి ఇంకా ఆగటం ఏముంది, నో మైండ్ స్టేట్ కి వెళ్ళాక ఏమి ఆగుతాడు? ఇది అద్భుతంలా ఉంటుంది మనకి. నిగ్రహించుకోవటం కాదు, వాడికి అసలు చంపుదామనే ఆలోచనే పోయింది.

గౌతమబుద్ధుడికి గుడి లేదు. గౌతమబుద్ధుడిని ఆనంద్ అడిగాడు, మీ శరీరం ఈ రోజున పోయేలా ఉంది, దీనిని ఏమి చేయమంటారు అని అడిగాడు. బుద్ధుడు ఏమన్నాడు అంటే ఆనంద్ ఇప్పుడు మనం ఉన్నది ఒక ఊరే కదా. ఈ ఊరిలో అందరినీ ఏ శ్మశానంలో కాలుస్తారో, ఈ శరీరాన్ని కూడా తీసుకెళ్ళి అక్కడే కాల్చేయండి. ఈ శరీరంలో ఏమీ ప్రత్యేకత లేదు. బుద్ధుడు పోయాక, శరీరాన్ని ఫలానా చోట కాల్చారు అని లోకానికి గుర్తు కూడా అక్కరలేదు అన్నాడు. వాడు బుద్ధుడు. మానవజాతి మీద అమృతం వర్షింపచేసి, మానవజాతి గుర్తు ఉంచుకోవాలన్న తలంపు కూడా అక్కడ లేదు. అదీ జ్ఞానం అంటే! మానవజాతికి తన జీవితాన్ని ఇచ్చి, మళ్ళీ ఈ జాతి గుర్తుంచుకోవాలి అన్న తలంపు కూడా ఆయనకి లేదు.

నీ తరువాత మా గురువు ఎవరు అని ఆనంద్ అడిగితే, నా తరువాత నా వాక్యమే మీకు గురువు అన్నాడు బుద్ధుడు. బుద్ధుడు 5 నిమిషాలలో చనిపోతాడు అనగా ఈ భూమి మీద నీలాంటి వాడు నడవలేదు అన్నాడు ఆనంద్. నువ్వు వరల్డ్ హిస్టరీ చదివావా అని అడిగాడు బుద్ధుడు, లేదు అన్నాడు. వరల్డ్ హిస్టరీ చదవకుండా అలాగ అనకు అన్నాడు. ఎంత ప్రాక్టికల్‌గా చెప్పాడో చూడండి.

బుద్ధుడిని రెబెల్ చైల్డ్ ఆఫ్ హిందుఇజం (Rebel Child of Hinduism) అంటారు. బుద్ధుడి కాలంలో భగవంతుడి పేరిట కర్మకాండలూ యజ్ఞయాగాదులూ ఎక్కువగా ఉండేవి. ఈ కర్మకాండలతో అంతర్యామిగా ఉన్న దేవుడికి దూరం అవుతున్నారు, బహిర్ముఖులు అయిపోతున్నారు అని, దేవుడి మాట తలపెట్టే వాడు కాదు బుద్ధుడు. హిందూమతంలో ఉన్న మూఢనమ్మకాలనూ, మూఢ ఆచారాలనూ బుద్ధుడు ఖండించాడు. అందుకేఆయనని రెబెల్ చైల్డ్ ఆఫ్ హిందుఇజం (Rebel Child of Hinduism) అంటారు.

ప్రపంచంలో ఏ మూలకి వెళ్ళి చూసినా ఏమున్నాయి రాగద్వేషాలు తప్ప అన్నాడు బుద్ధుడు. మీరు ఏ యూనివర్శిటీలో చదివినా ఏ దేశంలో చదివినా, ఏ కాలేజీలో చదివినా, ఏ బళ్ళో చదివినా ఒకటే నేర్చుకోవలసింది. చెడ్డని ఎలా విడిచిపెట్టాలో నేర్చుకోండి, మంచిని ఎలా చెయ్యాలో నేర్చుకోండి. అదే గౌతమ బుద్ధుడు చెప్పేది.

**బుద్ధం శరణం గచ్ఛామి**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 30 డిసెంబర్ 1984, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

24 గంటలు మన గురించి మనం ఆలోచించుకోవటం; నా గురించి నేను ఆలోచించుకోవటం మీ గురించి మీరు ఆలోచించుకోవటం; దీనికి సాధన అని పేరు! సాధన వలన ఈ దేహం నేను, మనస్సు నేను అనే భావన బలపడుతోందా లేకపోతే విడిపోతోందా? సాధన పేరు మీద మాయ పెరుగుతోందా, అజ్ఞానం పెరుగుతోందా, లేకపోతే జ్ఞానం పెరుగుతోందా!

లక్ష్మి అంటే ఎవరు? ఈ శరీరము, ఈ మనస్సు. సూర్యనారాయణ రాజుగారు అంటే ఎవరు? ఈ శరీరము, మనస్సు! ఎన్ని సంవత్సరములు సాధన చేసినా, ఈ శరీరాన్ని మనస్సుని దాటకపోతే ఆ సాధన వలన ప్రయోజనం ఏమిటి? దేనికి ఉద్దేశించబడ్డట్టు ఆ సాధన? దేహభావన బలపరుచుకోవటానికి సాధనా; దేహభావన పోగొట్టుకోవటానికి సాధనా? మీకు దేహ భావన ఉంది కదా. సాధన వలన దేహభావన పోవాలి. మరి సాధన చేసి దేహ భావన పెంచుకుంటే, సాధనా అది? మీ వాంఛలని నేరవేర్చుకోవటం కోసం దేవుడిని ప్రార్థిస్తూ ఉంటే మీరు జీవలక్షణాలు పెంచుకుంటున్నారా, జీవలక్షణాలు తగ్గించుకొంటున్నారా?

జీవుడు అంటే ఏమిటి అని కంగారు పడతారు ఎందుకు? ఇది చాలా చిన్న విషయం, మీకు అర్థం అవ్వకే కంగారు పడుతున్నారు. జీవుడు అంటే ఎవరు? మనస్సే జీవుడు. మీకు ఉన్న సంస్కారాలు, మీకు ఉన్న తలంపులు, మీకు ఉన్న కోరికలు, ఈ మూటే జీవుడు. జీవుడి కోసం, జీవుడిలో ఉన్న వాంఛల కోసం దేవుడిని ప్రార్థిస్తూ ఉంటే, దానివలన జీవలక్షణాలు పెరుగుతాయా, జీవలక్షణాలు తగ్గుతాయా? మీరు విషయం అర్థం చేసుకోండి.

తరువాత దేవుడిని ప్రార్థించవచ్చు.

మీకు జీవలక్షణాలు పోగొట్టుకోవాలని ఉందా, జీవలక్షణాలు అట్టే పెట్టుకోవాలని ఉందా? జీవలక్షణాలు అట్టే పెట్టుకోవాలని ఉంటే, అజ్ఞానం అలా నీకూడా వస్తూనే ఉంటుంది. జీవలక్షణాలని పోగొట్టుకుంటేనే కదా జ్ఞాని అవ్వటం! జీవత్వం ఉన్నంత కాలం ఎలా జ్ఞాని అవుతాడు? జీవత్వం ఉన్నంత సేపు వాడు అజ్ఞానే. జీవలక్షణాలు పోయిన వాడు జ్ఞాని. జీవలక్షణాలు ఉన్న ప్రతీవాడు అజ్ఞానే. మీరు సాధన దేని కోసం చేస్తున్నారు? హృదయంలో ఆత్మరూపంలో నేను ప్రకాశిస్తున్నాను అని గీతలో పరమాత్మ చెప్పాడు. అయితే మనకి అనుభవంలోకి ఎందుకు రావటం లేదు? ఈ చిన్న విషయం మీకు అర్థం అవ్వటం లేదు ఎందుకు?

అరుణాచలం వెళ్ళాలని, పుట్టపర్తి వెళ్ళాలని సంకల్పాలు పెట్టుకొని ఆ సంకల్పాల కూడా పరుగు పెడుతున్నారు. మీకు సంకల్పం వస్తే వచ్చారా, సంకల్పం లేకుండా ఇక్కడకు వచ్చేసారా? మీరు సంకల్పాన్ని సృష్టించుకొని, సంకల్పం కూడా ప్రయాణం చేస్తున్నారు. కాని ఈ సంకల్పాలు ఎక్కడినుంచి వస్తున్నాయి అని ఎప్పుడైనా ప్రశాంతంగా కూర్చుని ఆలోచించారా? అందరి హృదయాలలోనూ ఆత్మగా ప్రకాశిస్తున్నాను అని పరమాత్మ మొదట చెప్పాడు. అది ఒక్కటే నిజం. బయట ఉన్న గుళ్ళు గోపురాలు అన్నీ అబద్ధం. ఆయన ఇంకొకటి చెప్పాడు చెట్టుని నేను, పుట్టని నేను అంటూ చాలా చెప్పాడు. ఏం చేస్తాడు మనకు అర్థం కానప్పుడు! ఇదంతా ఎందుకు చెప్పాడంటే మొద్దు అబ్బాయిలు కూడా భగవంతుని బిడ్డలే. రావిచెట్టుని నేను అని ఎందుకు చెప్పాడు అక్కడ మనకు అర్థం కావటం లేదని అక్కడికి తీసుకెళ్ళి రావిచెట్టు రూపంలో కూడా నేను ఉన్నాను సుమా, అని చెప్పటం కోసం చెప్పాడు, కాని ఆయన రావిచెట్టు అని కాదు. ఆయన ఫస్ట్ స్టేట్మెంట్ కరెక్టు. అందరి హృదయాలలోనూ ఆత్మగా ప్రకాశిస్తున్నాను. అది ఒక్కటే నిజం. మనం అర్థం చేసుకోలేము కాబట్టి, మిగతావి అన్నీ మన కోసం కల్పించి చెప్పాడు. ఒక గుడి కట్టించండి మీరు, ఒక వెయ్యి సంవత్సరాలకో, రెండువేల సంవత్సరాలకో అది పడిపోతుంది. అది నిజం ఎలా అవుతుంది? ఒక రాముడి విగ్రహమో, కృష్ణుడి విగ్రహమో చేయించి గుళ్ళో పెట్టండి, వంద సంవత్సరాలకో రెండు వందల సంవత్సరాలకో ఆ విగ్రహం పోతుంది. అది నిజం ఎలా అవుతుంది?

మీరు చెరువులు తవ్వించినా కాలువలు తవ్వించినా మీరు జ్ఞానాన్ని సంపాదించలేరు, తరించలేరు. పనసకాయ కోసేటప్పుడు ముందు నూనె రాసుకుని తరువాత పనసకాయ కోస్తారు. ఎందుకంటే, జిడ్డు అంటుకోకుండా ఉండటం కోసం. అలాగే ముందు

మీరు జ్ఞానాన్ని సంపాదించండి. తరువాత చెరువులు తవ్వించండి, కాలువలు తవ్వించండి. చేతులకి నూనె రాసుకొని పనసకాయ కోస్తే, జిడ్డు ఎలా అంటుకోదో, మీరు జ్ఞానాన్ని పొందిన తరువాత ఏ పని చేసినా అది మిమ్మల్ని బంధించదు. మీరు జ్ఞానం పొందకుండా ఈ పనులు చేస్తారు అనుకోండి, అహంకారం ఏదో రూపంలో రియాక్ట్ అవుతుంది. అహంకారం పుట్టకుండా ఎలా ఉంటుంది, తప్పనిసరిగా వచ్చేస్తుంది! లోపల రోగం ఉన్నంతసేపు బాధ లేకుండా ఎలా ఉంటుంది? లోపల మీరు ఏదైనా రోగం దాచుకున్నారు అనుకోండి, సహించ లేని బాధ ఉంటుంది కదా! లోపల రోగం ఉన్నంత సేపు బాధ వచ్చేస్తుంది కదా, అది సహజం కదా! అలాగే లోపల అజ్ఞానం ఉన్నంతసేపు దుఃఖం వచ్చేస్తుంది, అహంకారం వచ్చేస్తుంది.

ఒకాయన చెరువు తవ్వించి నాలుగు రేవులు కట్టించాడు. ఆ రేవులోకి వచ్చి స్నానం చేసినప్పుడల్లా, ఇంతమంది స్నానం చేస్తున్నారు రేవులోకి వచ్చి, ఇంతమంది నీళ్ళు పట్టుకుని వెళ్తున్నారు, ఎంత పుణ్యం వస్తుంది నాకు, అనుకొనే వాడట. నిజమే మరి, చెరువు అతను తవ్వించాడు! తరువాత ఆ రేవు పాచి పట్టింది. వెళ్ళిన వాడల్లా పడిపోయే వాడంట పాపం. రేవు కట్టించిన వాడు శ్రద్ధ చెయ్యలేదు, ఆపాచిని గోకించాలి. రేవులో ఇంతకు ముందు స్నానాలు చేసిన మాట నిజమే. ఆ పుణ్యం అంతా నీవు మూట కట్టుకుంటున్నావు, నువ్వు శ్రద్ధ చేయలేదు ఇప్పుడు పాచిపట్టి రేవులోకి వచ్చిన వాళ్ళు అందరూ పడిపోతున్నారు. ఈ పాపం ఎవరికి ఇస్తావు? నువ్వు చెరువు తవ్వించిన మూలానే వీళ్ళందరూ పడిపోతున్నారు. ఈ పాపం మాట ఏమిటి? న్యాయంగా ఉందా ఇక్కడ! ఎవరికి గెంటుతావు ఈ పాపాన్ని? పంచాయితీ వాళ్ళు తీసుకుంటారా ఈ పాపాన్ని? చెరువు వీడు తవ్వించాడు, పుణ్యం వీడు కావాలి అంటున్నాడు. పంచాయితీ వాళ్ళ మీదకి ఎలా గెంటుతాడు ఈ పాపాన్ని? పుణ్యం పంచాయతీ వాళ్లకి ఇచ్చేస్తే, పాపం కూడా పంచాయతీ వాళ్లకి పోతుంది.

ఆత్మ కామించదు. ఎందుకంటే తనకంటే భిన్నంగా ఏ వస్తువు లేదు కాబట్టి. మనస్సు కామిస్తుంది, ఎందుకంటే తన కంటే వస్తువు వేరుగా కనిపిస్తుంది కాబట్టి, మనస్సుకి కామించటమే కాని ప్రేమించటం తెలియదు. వస్తువువేరుగా కనిపిస్తున్నంత కాలం మీరు ఎంత ఉగ్గపెట్టుకున్నా కామించకుండా ఎలా ఉండగలరు? ఆత్మకి తనకంటే వేరుగా ఏ వస్తువు లేదు కాబట్టి, కామించటం అనే సమస్య లేదు; ప్రేమించటం తప్పించి.

మనిషికి భ్రాంతి కలుగుతోంది అంటే బుద్ధిలో ఉన్న దోషం. ఈ శరీరం నాది, ఈ సంసారం నాది అని నేను వీటితో ఐడెంటిఫై అవుతున్నాను అనుకోండి,కలుస్తున్నాను అనుకోండి, ఈ శరీరానికి ఏదైనా బాధ వచ్చినా, ఈ శరీరానికి సంబంధించిన సంసారానికి

ఏదైనా బాధ వచ్చినా దుఃఖం వస్తుంది. అలాగే నాకు పది ఆశ్రమాలు కట్టారు అనుకోండి మీరందరూ కలిసి, ఇప్పుడు ఈ శరీరం తోటి ఎలా కలుస్తున్నానో అప్పుడు ఆ ఆశ్రమాల తోటి అలాగే కలుస్తాను. అంటే అప్పుడు దొడ్డి పెద్దది అయ్యింది అన్నమాట. చిన్న దొడ్డి అల్లా పెద్ద దొడ్డి అయ్యింది. అయితే నాకు అజ్ఞానం పోయిందా? మనస్సుని ఎంతో సూక్ష్మం చేస్తేనే కాని సున్నిత విషయాలు తెలియవు. సైంటిస్ట్ కి మనకి తేడా ఏంటి అనుకుంటున్నారు? మనస్సు సూక్ష్మం అయ్యే కొలది ప్రకృతి రహస్యాలు తెలుస్తాయి. వాడు సైంటిస్ట్ అవుతాడు. ఆధ్యాత్మిక విషయాలు కూడా మనస్సు స్థూలంగా ఉన్నవాడికి తెలియవు. మనస్సు సూక్ష్మం అయితేనే తెలుస్తుంది. సూక్ష్మాతి సూక్ష్మమైన విషయాలు కూడా తెలియాలంటే మనస్సు సున్నితం అవ్వాలి. మనస్సు బాగా నిర్మలం అవ్వాలి.

C.V. రామన్ గారికి మనకి తేడా ఏమిటంటే, ఆయనకి ఉన్న ఏకాగ్రత మనకి లేదు. అందుచేత ఆయన సైంటిస్ట్ అయ్యాడు, మనం అవ్వలేదు. రమణ మహర్షి గారికి మనకి తేడా ఏమిటంటే, ఆయనకి ఉన్న ఏకాగ్రత మనకి లేదు; ఆయన ఋషి అయ్యాడు. మనం అవ్వలేదు. మనలాగే ఆయనా మనిషే, అయితే ఆ ఏకాగ్రత, ఆ నిర్మలత్వం రెండూ మనకి లేవు. అసలు మీకు ఏకాగ్రత వచ్చిందంటే, జ్ఞానం వచ్చేసినట్లే. సరైన ఏకాగ్రత ఎవరికి వస్తుంది? ప్రహ్లాదుడిది గొప్ప ఏకాగ్రత. కారణం ఏమిటి? తన శరీరాన్ని రక్షించుకోవటం కోసం అతను ఏమీ ప్రయత్నం చెయ్యలేదు. అతనికి అశాంతి తీసుకువచ్చే వాసన లోపల ఏమీ లేదు. అందుచేత గొప్ప ఏకాగ్రత ప్రహ్లాదుడిది.

శంకరాచార్యులు వారు చెప్పినది ఏంటంటే, ప్రపంచంలో బహు కష్టమైనది భక్తి అన్నారు. మనందరికి భక్తి ఉంది కదా, కష్టం ఏంటండి ఇంకా ఇందులో? మనకి ఉన్నది వ్యాపారం. మీకు భగవంతుడి యందు పరిపూర్ణమైన ప్రేమ కలగాలి. ఆయన వద్ద నుంచి ఏమి కోరుకోకూడదు. భగవంతుని వద్ద నుంచి ఇది కావాలి అనే సంకల్పం మీకు రాకూడదు. అది భక్తి అంటే. మనది కారణభక్తి. ఏదో కారణం వలన మనకి భక్తి వచ్చింది. దీని వలన ప్రకృతికి సంబంధించిన కోరికలు నీకు నెరవేరితే నెరవేరవచ్చును. కాని కారణభక్తి వలన మోక్షం రాదు. మనకు అకారణభక్తి రావాలి అంటే భక్తి ఉండాలి, కారణం కనబడకూడదు. కొంతమంది రోగం తగ్గాలి అని భగవంతుడిని ప్రార్థిస్తారు. కొంతమంది చదువు రావాలి అని భగవంతుడిని ప్రార్థిస్తారు. కొంతమంది ధనం కావాలి అని భగవంతుడిని ప్రార్థిస్తారు. కొంతమంది ఏమంటారు అంటే గౌరవం ఉండాలి కాని డబ్బుకి ఏంటి అంటారు. మరి గౌరవం ఎవరికీ? గౌరవం అహంకారానికే. అహంకారం లేని వాడికి గౌరవం ఎందుకండీ?

ఇవన్నీ తింగర మాటలు. ఏం మాట్లాడుతున్నారో వాళ్లకి తెలియదు. డబ్బుకేమిటండీ గౌరవం ఉండాలి కాని అంటారు. అబద్ధమేనండీ, డబ్బు వద్దు అనే మాట కూడా అబద్ధమే. అసలు వాళ్ళు ఏం మాట్లాడుతున్నారో వాళ్ళకే తెలియదు వంద ఏళ్ళు వచ్చినా. మీరు నిజంగా భక్తులనుకోండి మీకు నిజంగా కావలసింది భగవంతుడా లేక గౌరవమా? గౌరవాన్ని కోరుతున్నారు అంటే అహంకారాన్ని పెంచుకోవటమే. ఎవరికి గౌరవం? ఆత్మకి గౌరవం కావాలా? అహంకారానికి గౌరవం కావాలా?

ప్రపంచం యొక్క మోహంలో మీరు ఉన్నారు. మోహం ఉన్న మనిషి జ్ఞాని ఎలా అవుతాడు? అయ్యే అవకాశము లేదు. మనకు కొంతమంది వ్యక్తుల మీద అనురాగం ఉంటుంది, కొంతమంది మీద అనురాగం ఉండదు. దానికి మోహమే కారణం. ఎవరైతే ఉపకారం చేస్తారు అని మనం అనుకుంటామో, వాళ్ళు ఉపకారం చెయ్యరు. ఎవరైతే అపకారం చేస్తారని మనం అనుకుంటామో, వాళ్ళు వచ్చి మనకి ఉపకారం చేస్తారు. మొత్తం అంతా మన చేతిలో ఉందనుకుంటాము, కాని ఇటువంటి సంఘటనలు మన జీవితంలో అనేకం జరుగుతూ ఉంటాయి. కారణం ఏమిటి? ఈ సృష్టిని నడిపేది మనం కాదు. కర్త ఈశ్వరుడు! కొంతమంది దగ్గర మనం ఏమీ ఆశించం. ఇంటికి వచ్చి ఎంతో ఉపకారం చేస్తారు. ఒక వ్యక్తికి జీవితం పొడుగునా పాలేరుతనం చేస్తాము. వాడి దగ్గర నుంచి మనకి ఏమీ రాదు. అంటే మన చేతిలో ఏమీ లేదు. అంతా ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతుంది.

నీకంటే వేరుగా దేవుడు కనిపించకూడదు. నీకు దేవుడి యందు విపరీతమైన భక్తి కుదరాలి. అది గొప్ప భక్తి, అది ఉత్కృష్టమైనది. రాముడు అంటే మీకు ఇష్టం ఉన్నా మీ మనస్సు అక్కడేనిలబడదు, బయటికి వెళ్లిపోతూ ఉంటుంది. మీరు కాపలా ఎంతసేపు కాస్తారు? బయటికి వెళ్తే మనస్సుని ఆపుచెయ్యలేరు. రాముడి దగ్గర ఉంటుందా అది, ఉండదు! వేంకటేశ్వర స్వామి దగ్గర ఉంటుందా? ఒక ఐదు నిమిషాలు ఉంటుంది, మళ్ళీ తరువాత ఏ దూళ్ళ దొడ్డిలోకో పోతూ ఉంటుంది. ఇది ఈగల భక్తి అన్నాడు రామకృష్ణ పరమహంస.

జీవుల భక్తి ఎటువంటిది అంటే ఈగల భక్తి అంటున్నాడు రామకృష్ణుడు. ఈగలు ఏం చేస్తాయి అంటే, మరుగుదొడ్డిలోకి వెళ్లి అశుద్ధం మీద వాలి వస్తాయి, అప్పుడే మనం మిఠాయి వండుకొని అక్కడ పెడతాము అనుకోండి, ఆ ఈగ వచ్చి మిఠాయి మీద వాలుతుంది. ఈ మనుషుల భక్తి కూడా అటువంటిదే అన్నాడు రామకృష్ణుడు. మనం ఏం అనుకొంటున్నామో అని కూడా తెలియకుండా చెప్పేస్తున్నాడు ఏంటండీ ఆయన! మన భక్తి ఈగల భక్తి అంటండీ! అప్పుడే రాముడి మీద ఉంటుంది మనస్సు, మళ్ళీ రెండు నిమిషాల

తరువాత ఇంకో చోటికి పోతుంది. మీకు భక్తి నిలబడాలి అంటే, ఏది ఉత్కృష్టమైన భక్తి అంటే, దేవుడు మీకంటే భిన్నంగా కనబడకూడదు. దేవుడి మీద విపరీతమైన భక్తి పుట్టుకురావాలి. అది సరియైన భక్తి. అప్పుడు బాలన్స్ తప్పదు. బయట రాముడినో, వేంకటేశ్వర స్వామినో పూజ చేయకూడదు అనటం లేదు. అసలు భక్తి లేకపోవటం కంటే ఆ భక్తి మంచిదే. అసలు చదువు లేకుండా ఉండటం కంటే ఉత్తరం రాసే చదువైనా మంచిదే. కొంతమంది సంతకం పెడతారు; చదువు వచ్చినట్లు లెక్క కాదు. చదువు రావటం అంటే అర్థం ఏమిటంటే, ఇప్పుడు ఎవరికైనా ఉత్తరం రాయాలి, ఎవరైనా ఉత్తరం రాస్తే మీరు చదువుకోవాలి, అప్పుడు చదువు వచ్చినట్లు.

మన స్వరూపం ఏమిటి? ఆత్మ. దానియందే భక్తి కలిగి ఉండాలి. అదే ఉత్కృష్టమైనది. మీకంటే భిన్నంగా ఉన్న దేవుడి మీదో, మీకంటే భిన్నంగా ఉన్న వస్తువు మీదో మనస్సు పెట్టినా, అది ఆరోజుకారోజు చలించిపోతూ ఉంటుంది. మీకు భక్తి ఉండాలి, ఈశ్వరుడిని మీ స్వరూపంగా చూడాలి. ఈశ్వరుడిని మీకు భిన్నంగా చూడకూడదు. వాసనాక్షయం అయ్యే వరకూ జీవితంలో ఈ పోరాటం తప్పదు. హృదయంలో ఒక్క వాసన మిగిలిపోయినా జీవితంలో స్ట్రగుల్ తప్పదు. ఏదో ఒక రకమైన స్ట్రగుల్ ఉంటుంది. ఆ ఒక్క వాసన దుఃఖాన్ని తీసుకు వచ్చేస్తూ ఉంటుంది. ఆ దుఃఖంలోంచి విడుదలపొందటానికి మనం ప్రయత్నం చేస్తూ ఉంటాము. దీని కోసం మళ్ళీ సాధన, గురువులు, దేవుళ్ళు, ఇవి అన్నీ. మనకు రోగం వచ్చింది అనుకోండి ఈ డాక్టర్ కాకపోతే ఆ డాక్టర్, ఇలా కంగారు పడిపోతూ ఉంటాము. అలాగే దుఃఖం ఉంది. దుఃఖంలోంచి బయటపడటానికి ఈ గురువు, ఆ గురువు, ఈ దేవుడు, ఆ దేవుడు! ఏం చేస్తారు మరి! రోగం ఉంది, ఏదో డాక్టర్ దగ్గరికి వెళ్ళాలి కదా మీరు.

ఉన్నది ఒకటే వస్తువు. రెండు ఉన్నాయి అని అనుకుంటున్నారు మీరు. అందుకని లక్ష్యం పెట్టుకోవాలి. మనం స్మరించేవి అసత్యాలే. జీవితాన్ని మూడు ఘట్టాల కింద చూస్తాము. పుట్టుక వేరు అనుకుంటాము. పుట్టిన తరువాత 50 ఏళ్ళు వంద ఏళ్ళు జీవిస్తాము. అది వేరు అనుకుంటాము. చనిపోవటం వేరు అనుకుంటాము. కాని మూడు అబద్దాలే. మూడు ఒక్కటే. పుట్టటం వేరు, జీవించటం వేరు అనుకుంటాము, మరణించటం వేరు అనుకుంటాము. మూడు మూడుగా లేవు. మూడు ఒక్కటే. ఉన్నది ఒక్కటే మూడుగా కనిపిస్తోంది. ఎందుచేత, మనలో ఉన్న అజ్ఞానం వలన ఒక్కటే మూడుగా కనిపిస్తోంది. ఈ శరీరంలో ప్రాణం పోసినవాడే మళ్ళీ ఈ శరీరంలోంచి ప్రాణాన్ని బయటికి తీస్తాడు. కాని ఇంకొక్కడు ఎవడూ కలగచేసుకోడు. ఇంకొక్కడికి సంబంధం లేదు. ఇక్కడ బాగా

అర్థం చేసుకోవలసినది ఏమిటంటే, మనిషి యొక్క వివేకానికి పని ఏమిటంటే, సత్యం లోంచి అసత్యం విడగొట్టటం. ఇంతకంటే వివేకానికి పని లేదు. విడగొట్టిన తరువాత అసత్యాన్ని కంప్లీట్‌గా విడిచిపెట్టటమే వైరాగ్యం.

పుస్తకాలలో చదువుకున్న మాటలు చెప్పుకుంటున్నాము. ఏదో గోపాలస్వామి లాంటి పెద్దలు చెప్పిన మాటలు మనం చెప్పుకుంటున్నాము ఇదంతా మాయ అని. కాని ఆ మాట అనుభవంలో నిజం క్రింద అనిపిస్తుంది. అవ్వటానికి మాయే. సిద్ధాంతం కరెక్టే. కాని ఇదంతా మన అనుభవంలో నిజం కింద ఉందా అబద్దం క్రింద ఉందా? నిజం కింద ఉంది. అబద్దం నిజం కింద ఎందుకు కనిపిస్తోంది. కనిపించేది అబద్దం అయినప్పటికీ కనబడని సత్యం దీనికి ఆధారం. అందుచేత ఇది నిజం కింద కనిపిస్తుంది. అబద్దం ఎందుకు నిజంగా కనిపిస్తుంది? కనిపించేది అబద్దం అయినా దీనికి ఆధారంగా ఉన్నది నిజం, అందుచేత నిజంగా కనబడుతుంది. అక్కడ మనిషి యొక్క వివేకం అవసరం. వివేకం తోటి, ఏది అబద్దం ఏది నిజం, ఏది సత్యం, ఏది అసత్యం, అని విడదీసుకునే శక్తి బుద్ధికి రావాలి. పరిశుద్ధమైన బుద్ధి కాని విడదీయలేదు. కలుషితమైన బుద్ధి, మలిన బుద్ధి విడదీయలేదు దానిని. పరిశుద్దమైన మనస్సు పరిశుద్దమైన బుద్ధి మట్టుకే అబద్దంలోంచి నిజాన్ని విడదీయగలదు. సత్యాన్ని అసత్యాన్ని వేరు చేసిన తరువాత, అసత్యాన్ని వదిలివేయటానికి వైరాగ్యం కావాలి. సత్యాన్ని, అసత్యాన్ని విడదీస్తాడు అనుకోండి, వాడికి వైరాగ్యం లేదనుకోండి, అసత్యాన్ని పట్టుకొని ఉంటాడు, అసత్యాన్ని వదిలేయటానికి వివేకం ఒక్కటే చాలదు, వైరాగ్యం అవసరం.

15వ అధ్యాయంలో భగవంతుడు ఏం చెప్పాడంటే, వైరాగ్యం అనే ఖడ్గం తోటి ఈ అజ్ఞానం అనే చెట్టుని నరుకు అని చెప్పాడు. వైరాగ్యం చేసే పని నరకటం, అంటే విడిచిపెట్టటం. దేనిని విడిచిపెట్టటం? అసత్యాన్ని విడిచిపెట్టటం. ఇప్పుడు మీకు అయినా, నాకు అయినా ఎవరికైనా సరే వస్తువు యొక్క అనుభవం ఎంతో కొంత లేకపోతే మనం మాయలో పడిపోతాము. ఎంతటి కొమ్ములు తిరిగిన వాడు అయినా సరే వస్తువు యొక్క అనుభవం హృదయంలో ఎంతో కొంత లేకపోతే మీరు ఎన్ని సార్లు పుస్తకం చదివినా అసలుదారి కనబడదు. అగమ్యగోచరంగా ఉంటుంది.

నిజంగా మన స్వస్థానంలో మనం ఉంటే కోరిక ఎందుకు పుడుతుంది?కోరిక పుడుతోంది అంటే మన స్వస్థానంలో మనం లేము అన్నమాట. ఇప్పుడు మనకి భయం వేస్తోంది, ఊరికే అనుకోండి, మనకి భయం వేస్తోంది అంటే మన స్వస్థానంలో మనం

లేము అన్నమాట. సత్యానికి భయం వేస్తుందా? సత్యానికి కోరిక పుడుతుందా? లేదు. మనకి భయం వేస్తోంది అంటే, సత్యానికి మనకి సంబంధం లేకుండా ఉన్నామన్న మాట. అందుకు భయం వేస్తుంది. మనకు వికారాలు వస్తున్నాయి అనుకోండి, అసత్యానికి వికారాలు ఉన్నాయి కాని సత్యానికి వికారాలు ఉన్నాయా? లేవు! సత్యం తోటి సంబంధం లేకుండా ఉన్నాము కాబట్టి ఇవన్నీ వస్తున్నాయి.

లక్ష్యం ఉండటం మంచిదే. లక్ష్యం పెట్టుకోవటం ఎందుకు అంటే లక్ష్యం పెట్టుకున్న మనిషి, ఆదర్శం పెట్టుకున్న మనిషి నూటికి పది పొరపాట్లు చేస్తే, లక్ష్యం లేని మనిషి, ఆదర్శం లేని మనిషి నూటికి తొంబై పొరపాట్లు చేస్తాడు. ఉన్నది ఒక్కటే! లక్ష్యం పెట్టుకోవటం అంటే లక్ష్యం పెట్టుకునే వాడు ఒకడు, లక్ష్యం ఒకటి, రెండు అవుతున్నవి. ద్వైతం వచ్చేసింది అక్కడ.

మనం మరణించిన తరువాత ఏమి అవుతాము; స్వర్గ లోకము, నరక లోకము ఇవన్నీ ఆలోచిస్తాము. ఇవన్నీ అబద్దాలే. మీరు మనస్సు తోటి తిరుగుతూ ఉంటే, అన్ని సమస్యలు సృష్టిస్తూ ఉంటుంది. నిజం దగ్గరికి అది రానివ్వదు. ఎందుచేత అంటే, అది నిజం కాదు కాబట్టి. స్వర్గలోకము గురించి ఆలోచించమంటుంది. మరణించిన తరువాత మంచి లోకాలకి వెళ్దామని ఆలోచిస్తూ ఉంటుంది. నన్ను నాలాగ ఉండనివ్వదు. ప్రతి మనిషికి మనస్సు చేసే పొరపాటు అదే. నా మనస్సు వైకుంఠంలోకి వెళ్ళమంటుంది, అది నేను కాదు. కైలాసం వెళ్ళమంటుంది, నేను కాదు. నేను కానివి అన్నీ పట్టిచ్చి నన్ను కూడా తిప్పుతుంది. ఇదే అజ్ఞానం. ఈ పని చేసుకోండి మీరు కైలాసం లోకి వెళతారు, ఆ పని చేసుకోండి వైకుంఠంలోకి వెళతారు అని నేనుచెపుతాను అనుకోండి మీకు తియ్యగా ఉంటుంది. ఇవి అబద్దాలు! స్వాములు చెప్పినా, బ్రాహ్మణుడు చెప్పినా, నేను చెప్పినా, ఎవరు చెప్పినా తియ్యగానే ఉంటుంది. కాని ఇవన్నీ అబద్దాలే.

మీరు కాని దాని తోటి ఎప్పటికైనా విడిపోవటం తప్పదు. ఎంతకాలం ఉంటారు! శరీరం మీదని అనుకుంటారు అనుకోండి, నష్టం ఏమిటండి? ఎవరు అనుకోవద్దు అన్నారు మిమ్మల్ని? కాని శరీరం నుండి విడిపోవటం తప్పదు. ఎందుచేతంటే అది నిజం కాదు కాబట్టి. స్వర్గలోకం అవ్వనివ్వండి, వైకుంఠం అవ్వనివ్వండి, లేకపోతే దేవుడు అవ్వనివ్వండి, ఏదో ఒక రోజు విడిపోవటం తప్పదు. ఆ విషయం మనము తెలుసుకోము అనుకోండి, తెలుసుకోక పోవటం అనేది మన నేరం కాని, సత్యం నేరం కాదు. అది ఏమైనా తెలుసుకోవద్దు అని మీకు చెప్పిందా?

అద్దంలో మన ప్రతిబింబం చూసుకొంటూ పౌడరు రాసుకుంటాము మన

ముఖానికి. మన ప్రతిబింబం ముస్తాబు అవుతుందా మనము ముస్తాబు అవుతున్నామా! ఆ బొమ్మ కూడా పౌడరు రాసుకుంటా ఉంటుంది. నేను ముస్తాబు అవుతున్నానా లేకపోతే అద్దంలో కనబడే బొమ్మ ముస్తాబు అవుతుందా! నేను ముస్తాబు అవ్వటానికి అద్దం పని ఏమిటి? అంటే నేను సరిగ్గా ముస్తాబు అవుతున్నానో లేదో అద్దం చూపిస్తుంది. దేవుడు చేసే పని అది. శాస్త్రం చేసే పని అది. నువ్వు బాగు పడటానికే దేవుడు, నువ్వు బాగు పడటానికే శాస్త్రం. నువ్వు ముఖం బాగా ముస్తాబు చేసుకోవటానికి అద్దం యొక్క పని. అంతకన్నా అద్దంతో పని లేదు. మనం లక్ష్యాన్ని అందుకోవాలి అంటారు, కాని లక్ష్యం ఇక్కడే ఉంది. లక్ష్యం ఇప్పుడే ఉంది. మరి వాయిదాలు వెయ్యటం ఎందుకు ఇంకా! ఏది అడ్డు వస్తోంది? లక్ష్యం పెట్టుకోవాలి మనం అని లోపల ఏదో చెపుతోంది చూడు, అదే అడ్డు వస్తోంది లక్ష్యం చేరుకోవటానికి. అది ఉందని దాని అస్థిత్వాన్ని అంగీకరించి లక్ష్యం దగ్గరికి చేరుకోవాలని అనుకుంటుంది.

ఒక పైసా కూడా ఖర్చు పెట్టక్కర లేకుండా, కూర్చోవటానికి బల్ల అక్కర లేకుండా, చాప అక్కరలేకుండా, శారీరిక శ్రమ లేకుండా, డబ్బు ఖర్చు లేకుండా వచ్చేది జ్ఞానం. ఇక్కడ కూర్చున్న వాళ్ళలో ఎవరికైనా కష్టాలు ఉండవచ్చు. కష్టం ఎలా ఉంటుంది? దేహం ప్రారబ్ధాన్ని బట్టి వచ్చింది. ప్రారబ్ధం లేకపోతే దేహం రావలసిన పని లేదు. ప్రారబ్ధాన్ని బట్టి వచ్చింది. ప్రారబ్ధానికి మీరు సహకరిస్తే కష్టం పోతుంది. ప్రారబ్ధం మీద కోలాటం వేస్తాడు, దుఃఖంవస్తుంది. ప్రారబ్ధానికి సహకరిస్తే, కష్టం పోతుంది, కొత్త వాసన పుట్టదు. ప్రారబ్ధానికి మీరు సహకరించక పోతే కష్టం ఇంకా ఎక్కువ అవుతుంది. కొత్త వాసన పుడుతుంది. సహాయం నిరాకరిస్తే అది బరువుగా ఉంటుంది. మీరు దానికి సహకరిస్తుంటే, తేలికయ్యి అది రాలిపోతుంది.

ఏ శక్తి అయితే మిమ్మల్ని ఈ భూమి మీదకి తీసుకు వచ్చిందో, ఏ శక్తి అయితే మిమ్మల్ని భూమి మీద నుంచి బయటికి తీసుకు పోతుందో, ఆ శక్తే మిమ్మల్ని కొంతమంది చేత పొగిడిస్తుంది, కొంతమంది చేత తిట్టిస్తుంది. ఈ పనులన్నీ చేసేది ఒక్కటే. ఇందులో మీరు తొందరపడవలసిన పని లేదు. ఈ దేహంలో ఉండగా, ఈ లోకంలో ఉండగా, ఇప్పుడే ఈ సెకనులో కనుక మీకు జ్ఞానం కలగాలంటే, ఒకటే ఒక పద్ధతి. మీ జీవితంతో మీరు రాజీ పడండి. మిమ్మల్ని నేను ఏమి బలవంతం చెయ్యటం లేదు. సాధనలు చెయ్యమనటం లేదు, కష్టపడమనటం లేదు. ఈ సెకనులో మీరు జ్ఞానులు అవుతారు, మీ జీవితంతో మీరు రాజీ పడితే. నేను మిమ్మల్ని ప్రాణాయామం చెయ్యమనటం లేదు, గుంజీలు

తియ్యమనటం లేదు, కూర్చోమనటం లేదు, యాత్రలకి వెళ్ళమనటం లేదు, మీకుఏదైనా కష్టమైన మాట ఒక్క మాటచెపుతున్నానా నేను! మిమ్మల్ని ఒక్క పైసా ఖర్చు పెట్టమనటం లేదు. మీ జీవితం తోటి మిమ్మల్ని రాజీ పడమంటున్నాను. మీ పక్కింటి వాళ్ళతో రాజీ పడండి అంటే, వాళ్ళు చెడ్డ వాళ్ళు అని మీరు అనవచ్చు. వాళ్ళతో కూడా రాజీ పడమనటం లేదు నేను. మిమ్మల్ని మీతోనే రాజీ పడమంటున్నాను. మీకు ఈ సెకనులో జ్ఞానం కలుగుతుంది.

ప్రాణం పోతోంది అంటే భయపడతారు కదా అందరూ! ప్రాణం అంటే గాలి. గాలి వీడు కాదు కదా భయపడటానికి. వాడు కానప్పుడు వాడికి భయం ఎందుకండీ! నువ్వు గాలిరా అంటాము అనుకోండి ఎవరినైనా, ఊరుకుంటాడా వాడు? అలా అంటే వాడు ఊరుకోడు కదండీ. పైగా పోయేటప్పుడు వాడు గాలి కాదని తెలిసిపోతుంది. వాడు కానిదివాడు అని మనం అంటున్నాము కాబట్టి వాడికి కోపం వస్తుంది. మరి అదిపోయినప్పుడు వాడికి భయం ఎందుకండీ ఇంక!

మనం అజ్ఞానంలో కూరుకుపోవటానికి కారణం ఏమిటి అంటే మనం సమాజాన్ని కాపీ చెయ్యాలని చూస్తున్నాము అందుచేత ఆ రోజుకారోజు అజ్ఞానంలో కూరుకుపోతున్నాము. శాస్త్రాన్ని అద్దం కింద పెట్టుకోవాలి కాని, సమాజాన్ని కాదు అద్దంగా పెట్టుకోవలసింది. లోకంలో చెప్పుకునే మాటలు ప్రమాణం కాదు, శాస్త్ర ప్రమాణం అన్నాడు గీతలో. ఎల్లమ్మ పుల్లమ్మ చెప్పిన మాటలు నీకు ప్రమాణం అని చెప్పలేదు కృష్ణుడు గీతలో; నీకు శాస్త్రం ప్రమాణం అన్నాడు.

భయం వేస్తుంది అంటే మనం అసత్యంలో ఉన్నట్లే. నేను చచ్చిపోతున్నాను అని అనుకుంటాడు అనుకోండి మనిషి నిజంగా మరణించేటప్పుడు కూడా వాడు అసత్యంలో ఉన్నట్లే. సత్యానికి చావు ఏముంటుంది. ఒకవేళ సత్యం మరణిస్తే ఆ సత్యం మనకి ఎందుకండీ. మీ హృదయంలో సత్యం తెలుసుకున్న రోజున, ఇప్పుడు మీరు ఏ దేవుడిని అయితే పూజిస్తున్నారో, ఆ దేవుడు వచ్చి మీఎదురుగా కనిపిస్తే, వాడిని కన్నెత్తి చూడాలి అని కూడా మీకు అనిపించదు. తాటాకు ఇంట్లో ఉన్న వాడిని, ఆ తాటాకు ఇల్లు ఖాళీ చెయ్యమంటే చెయ్యడు వాడు. తాటాకు ఇల్లు ఖాళీ చేస్తే, నీడ ఏది వాడికి? వాడికి ఏదైనా పెంకుటిల్లు చూపించి, నువ్వు ఆ పెంకుటింటిలో ఉండరా అబ్బాయీ, ఈ తాటాకు ఇల్లు ఖాళీ చెయ్యరా, అంటే ఖాళీ చేస్తాడు. మనం వాడికి ఇంకోచోట నీడ చూపించి ఖాళీ చెయ్యరా అంటే ఖాళీ చేస్తాడు. ఎందుచేత ఖాళీ చేస్తాడు అంటే ఈ ఇల్లు కంటే ఆ ఇల్లు బాగుంటుంది కాబట్టి.

మీ మనస్సుకు ఆత్మకి సంబంధించినటువంటి లోతులు, సత్యాలు కొన్ని తెలియబడితేనే గాని, ఇప్పుడు నీ మనస్సు ఏ విషయాలలో అయితే విహరిస్తోందో, ఆ

విషయాలను విడిచిపెట్టదు. నేను చెప్పే పురాణాలు వలన నీ మనస్సు విడిచిపెట్టదు. నీ ఇంటిలో మామూలు అరటిపండు ఉంది, దానిని పడేయమంటే పడేయరు. దాని కంటే మంచి అరటిపండు, అంటే ఏ చక్రకేళియో ఇంకా మంచి అరటిపండు ఇచ్చి పడేయమంటే పడేస్తారు. పది రూపాయల కాగితం ఉందనుకోండి, దానిని పడేయమంటే పడేయరు. వంద రూపాయల కాగితం మీ చేతిలో పెట్టి దానిని పడేయమంటే పడేస్తారు. ఎందుకంటే ఇది దానికంటే పెద్దది అని తెలుస్తుంది కాబట్టి పడేస్తారు. ఇప్పుడు మీరు అనుభవించే విషయాలకి సంబంధించినటువంటి సంతోషానికి, ప్రపంచానికి సంబంధించి నటువంటి సంతోషానికి అతీతమైన సంతోషం మీ మనస్సుకి దొరికిన రోజున, ఆ పట్టు కుదిరిన రోజున ఇది విడిచిపెడుతుంది కాని లేకపోతే విడిచి పెట్టదు మీ మనస్సు.

మూర్ఖులతోటి మాట్లాడకూడదు. అసలుమాట్లాడకుండా మౌనంగా ఉన్నా పరవాలేదు. గౌరవంగా జీవించాలి అని కొంతమంది అంటూ ఉంటారు. సత్యాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయకుండా మీరు జీవితం పొడుగునా గౌరవం కోసం కృషి చేస్తారు అనుకోండి, జీవితం అంతా వృధా చేసుకున్నట్లే. మీరు వంద బస్తాలు, రెండువందల బస్తాలు బియం తిన్నా శరీరం ఏదో రోజున పడిపోతుంది, ఎందుచేతంటే అది నిజం కాదు కాబట్టి. వారు కృషి చేస్తారు, వీరు కృషి చేస్తారు అంటారు , అదే తప్పు. వారిని ప్రమాణంగా పెట్టుకొని భగవంతుడు మనకి చెప్పటం లేదు కదా. భగవంతుడు చెప్పిన మాటలని మనం నమిలి మింగాలి. ప్రపంచంలో వస్తువుల కోసం, గౌరవాలకోసం, మీరు జీవితమంతా ఖర్చు పెడతారు అనుకోండి, ప్రమంచంలో దేనికోసం మీరు ప్రయత్నం చేసినా, దేనికోసం మీరు సాధన చేసినా, దేనికోసం మీరు వెదికినా, దేన్నీ మీరు పొందినా, అది అబద్ధం సరేసరి. అక్కడ నుంచి మళ్ళీ మనస్సుని వెనక్కి లాక్కోవటం కోసం, మనస్సుని మళ్ళీ స్వస్థానంలోకి తీసుకురావటం కోసం, కొన్ని వేల జన్మలు పడుతుంది.


ఆత్మ యొక్క స్వరూపం సుఖం. అయితే నీకు దుఃఖం ఎందుకు వస్తోంది? మీరు ఎందుకు కష్టపడుతున్నారు. మీకు కష్టం ఎందుకు వస్తుంది అది చూసుకోండి? మీ దుఃఖాన్ని మీరు పోగొట్టుకోలేనప్పుడు, మీ కష్టాన్ని మీరు పోగొట్టుకోలేనప్పుడు, నా కష్టాన్ని నా దుఃఖాన్ని ఎలా పోగొట్ట గలరు? నాకు దారి ఎలా చూపించగలరు? ఆత్మని మీరు పొందటానికి ప్రయత్నం చేస్తున్నారు అనుకోండి (మాటవరసకి), అంటే ఆత్మ మీరు కాదనుకొంటున్నారు అన్నమాట. మీరు కాదనుకుంటున్నారు కాబట్టి మీరు పొందటానికి ప్రయత్నం చేస్తున్నారు. పొందటం వలన వస్తుంది అనుకోండి, పొందటం వలన వచ్చింది ఎంత కాలం ఉంటుంది.

మళ్ళీ పోతుంది అది. ఇదంతా పెద్ద అడివి. ఆ దేవుడు గొప్పవాడని, ఈ దేవుడు తక్కువ వాడని, ఇదంతా ఒక పెద్ద అడివి. సరళంగా మనం తెలుసుకునే విషయాన్ని, సూక్ష్మంగా తెలియబడే విషయాన్ని, అడవి కింద సృష్టించేసుకోవటం వలన, మన మనస్సు అలా కల్పించు కోవటం వలన మనకి దుఃఖం వస్తుంది. పాపం గురించి మీకు తెలియకుండా మీరు పాపాన్ని ఎలా విడిచిపెట్టగలరు. పాపం చేసేవాడు ఇష్టంగానే చేస్తాడు, పుణ్యం చేసేవాడూ ఇష్టంగానే చేస్తాడు. వాడికి ఇష్టం లేకపోతే వాడు పాపం ఎలా చేస్తాడు. ఇష్టం లేకపోతే ఆ పని ఎలా చెయ్యగలరు మీరు. ఒక మనిషి ఇంకో మనిషిని చంపేస్తాడు అనుకోండి, వాడు ఇష్టంగానే చేస్తాడు. మీకు అసహ్యం క్రింద అనిపించవచ్చు. ఆపని ఇష్టం లేకపోతే వాడు ఎలా చంపగలడు ఆ మనిషిని! ఈ శరీరం కల్పితం అయినప్పటికీ, దీనికి సంబంధించిన మనుషుల మీద మనకి మోహం ఒకటి ఉంది. మోహం వలన పాపం చేస్తాడు మనిషి. మోహం లేకపోతే పాపం చెయ్యలేడు. మోహం ఎందుకు పుడుతుంది వాడికి? తాను కాని శరీరాన్ని, తాను కాని మనస్సుని, తాను అనుకుంటున్నాడు కాబట్టి మోహం పుడుతుంది. మోహం లోంచి పాపం పుడుతుంది. విషయాన్ని ఎంతకాలం అయితే విడదీసుకోడో, అంతకాలం వాడు పాపం చేస్తూనే ఉంటాడు. పాపం ఎందుకు చెయ్య వద్దు అన్నారు అంటే, పాపం చేసే కొలది బుద్ధి స్థూలం అవుతుంది. తన హృదయంలో ఉన్న సత్యాన్ని, తాను గ్రహించే శక్తిని, కోల్పోతాడు. తన హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటం కోసం ఈ పాపం అడ్డు వస్తోంది కాబట్టి, చెయ్యొద్దు అన్నారు. మనకి జిన్నూరులో ఉంటే దుఃఖం వస్తోంది అనుకోండి, అరుణాచలంలో ఉంటే సుఖంగా ఉందనుకోండి మాటవరసకి, అది జ్ఞానమా, అజ్ఞానమా!

**ఓంశాంతిః శాంతిః శాంతిః !**



**మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా,**
**ప్రతికూలంగా ఉన్నా అవి నిజం అని అనుకోవద్దు.**
**కాల ప్రవాహంలో అవి అన్నీ కొట్టుకొనిపోతాయి.**
**మన హృదయంలో ఉన్న చైతన్యం మనకు**
**దొరికేవరకు మనకు తిప్పలు తప్పవు.**



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**నిన్నే మార్చి యరుగనీక ఉల్లము పైని**

**ఉరుదిగా నుండుమా అరుణాచలా!**

తాత్పర్యం: నా మనస్సు నన్ను ఎలాగు మాయ చేసి ప్రకృతి లోనికి పరుగు పెడుతున్నది. అది నిన్ను కూడా మాయ చేస్తుందేమో! అందుచేత నా మనస్సు కదలకుండా, మెదలకుండా అణిగి ఉండేలా నా మనస్సులో నీవు స్థిరముగా నిలిచి ఉండు అరుణాచలా!

నిన్ను ఏమార్చి యరుగనీక - ఓ అరుణాచలేశ్వరుడా ఈ మనస్సు ఉంది చూసావు, దీనితోటి నేను ఎక్కడ పడగలను! నువ్వు కూడా పడలేవు. నిన్ను కూడా మోసం చేస్తుంది.

మనందరం కూడా వ్యవసాయం చేసుకోవటం, వంట చేసుకోవటం, ఇల్లు కట్టుకోవటం,ఇవన్నీ పని అనుకొంటున్నాము. ఈ ప్రకృతికి సంబంధించిన పనులే పనులు అనుకొంటున్నాము, కాని మనస్సుని నిగ్రహించటం అనేది కూడా ఒక పని అన్న సంగతి మనకి ఎవ్వరికీ తెలియటం లేదు. మనకి ఎన్నో పనులు ఉన్నాయి, ప్రకృతి పనులు. ఏదో పని చేసుకొంటేనే కాని పొట్ట వెళ్ళదు. కానీ ఏ వృత్తిలో వున్న మనస్సుని నిగ్రహించుకోవటం కూడా ఒక పనే అన్న సంగతి ఎవరికీ గుర్తు రావటం లేదు.

నిన్ను బంధములో పెట్టినా నీ మనస్సే, నిన్ను మోక్షానికి తీసుకెళ్ళినా నీ మనస్సే అని పరమాత్మ చెప్పాడు. అటువంటి మనస్సుని మనం నిగ్రహించుకోవాలి; అది కూడా మనం చేసే పనులలో ముఖ్యమైన పని. చదువు, డబ్బు, కీర్తి, పదవులు ఎలా సంపాదించు కొంటున్నామో, అదేవిధంగా మనస్సుని కూడా నిగ్రహించటం నేర్చుకోవాలి. ఇది కూడా ఒక పనే అని ఎప్పుడైనా మనకి స్ఫురణ కలిగిందా? మన శరీరాలు, గుణాలు, మన వృత్తులు పడిపోయినా, నిరంతరం మన కూడా జన్మ జన్మలకీ వస్తున్నటువంటి ఈ మనస్సుని బాగు

చేసుకోవటం కూడా ఒక పనే అన్న సంగతి మరచిపోవటం, ఇది మాయ కాదా!

నిన్ను ఏమార్చి - ఏమార్చటం అంటే మోసగించటం. ఈ మనస్సు ఉంది చూసావూ, అది నన్ను మోసం చేయటమే కాదు, నిన్నుకూడా మోసం చేస్తుంది. అందుచేత ఉల్లముపైని ఉరుదిగా కూర్చో, అంటే స్థిరముగా కూర్చో, నిలకడగా కూర్చో. నా మనస్సు పైనే నువ్వు కూర్చో. ఎక్కడికీ కదలకు. అలా స్టాండర్డ్ గా నువ్వు నా మనస్సుని పట్టుకొని నువ్వు కూర్చున్నప్పటికీ కూడా, ఎప్పుడో ఒకప్పుడు నిన్ను కూడా మోసం చేసే గుణం దీనికి ఉంది. అటువంటి మనస్సు ఇది. అందుచేత నువ్వు బహు జాగ్రత్తగా ఉండాలి సుమా! ఈశ్వరుడు జాగ్రత్తగా ఉండాలటండి! ఎందుచేతనంటే నన్ను ఎలాగో దగా చేస్తుంది. ఒకవేళ నువ్వు గొప్పవాడివి అనుకొంటున్నావేమో, నిన్ను కూడా దగా చేసేస్తుంది. అందుచేత నువ్వు కూడా జాగ్రత్తగా ఉండి నన్ను కాపలా కాయాలి. ఈ మనస్సు ప్రకృతి గొడవలలోకి వెళ్ళకుండా, నా మనస్సుమాయలో పడకుండా, నా మనస్సుపైని ఉరుదిగా ఉండు. నిన్ను కూడా మోసం చేసి, నిన్ను కూడా దగా చేసి బయటికి వెళ్ళిపోతూ ఉంటుంది.

ఒకోసారి రామా రామా అనుకొంటూ ఉంటాము, మనస్సు ఎక్కడికో పోతుంది. ఇది మన అనుభవంలో ఉన్నదే! రమణ స్వామి చెప్పాడని మీరు నమ్మొద్దు. అంటే ఏమిటి, భక్తుడిని కూడా దగా చేస్తుంది, సాధకుడిని కూడా దగా చేస్తుంది. ఇంక సాధకుడు కాని వాడిని భక్తుడు కాని వాడిని దగా చేస్తుందని చెప్పక్కరలేదు ఆ విషయం. జాగ్రత్తగా ఉన్న వాడిని కూడా ఇది దగా చేస్తుంది, అజాగ్రత్తలో పడేస్తుంది. అటువంటి ప్రమాదమైనది ఈ మనస్సు. అయితే ఉరుదిగా కూర్చోమంటున్నాడు కదా, మరి ఉరుదిగా కూర్చుంటాడా ఈశ్వరుడు? ఈశ్వరుడి పట్ల పరిపూర్ణమైనటువంటి ప్రేమ ఉండాలి.


ఉల్లము పైని ఉరుదిగా ఉండుము అరుణాచలా! నా ఉల్లము మీద, నా మనస్సుమీద స్థిరముగా ఉండుము అరుణాచలా. దీనికి పోలికగా ప్రహ్లాదుడు భాగవతంలో ఒక మాట చెప్పాడు. ప్రపంచంలో మన కళ్ళకి కనిపిస్తున్న వస్తువుల మీద అజ్ఞానికి ఎంత సహజంగా కుతూహలము, కోరిక ఉంటుందో, ఎంత ఆప్యాయత ఉంటుందో; అంతకంటే ఎక్కువ వద్దులే! అదే కోరిక అదే ఆప్యాయత నీ పట్ల నాకు ఉండేటట్లు చెయ్యి అంటాడు విష్ణుమూర్తితో. జ్ఞానం లేని వాడికి ప్రాపంచిక వస్తువుల మీద ఏరకమైన కోరిక, అభిలాష ఉంటుందో. ప్రాపంచిక వస్తువుల కోసం ఏరకంగా అయితే జీవిస్తూ ఉంటాడో, వాటినే స్మరిస్తూ,

వాటికోసమే తపిస్తూ ఉంటాడో, అటువంటి కోరికనే; ప్రాపంచిక వస్తువుల మీద అజ్ఞానికి ఉండే అభిలాషనే, నాకునీ పాదాల మీద ఉండేటట్టు చెయ్యి అన్నాడు. అలా చేస్తే సరిపోతుంది, అప్పుడు ఉరుదిగా కూర్చుంటాడు.

ప్రాపంచిక వస్తువులని స్మరించటానికి సాధన చెయ్యాలా, మన హృదయంలో ఉన్నవి అవే కదా! భగవంతుడిని స్మరించటానికి సాధన చెయ్యాలి కాని ప్రాపంచిక వస్తువులని స్మరించటానికి సాధన చెయ్యటం ఎందుకు? అసలు మనస్సే ప్రకృతి కదా! సినిమా మానేయ్యాలనే ప్రయత్నం చేయటానికి సాధన కాని, సినిమాకి వెళ్లాలని సాధన ఎందుకు, అసలు ఉన్నదే సినిమా కదా లోపల!

నా ఉల్లముపైన ఉరుదిగా ఉండుము అరుణాచలా. నా మనస్సు పైన స్థిరముగా ఉన్నా నువ్వు బహు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఏ క్షణంలో నిన్ను మోసం చేస్తుందో చెప్పలేము. అంటే నిన్ను మోసం చేసే శక్తి కూడా ఈ మనస్సుకి ఉంది. అరుణాచలేశ్వరుడిని ఈ మనస్సుమీద ఉరుదిగా ఉండమంటున్నాడు. అయితే అరుణాచలేశ్వరుడు ఉండడు అనుకోండి. నష్టం ఏమిటి? మనకి ఇంద్రియాలు ఉన్నాయి. ఈ ఇంద్రియాలు ఏంచేస్తాయి అంటే ఈ మనస్సు ఎప్పుడైతే అజాగ్రత్తగా ఉందో, ఈ మనస్సుని బయటికి లాగేస్తాయి. ఈ మనస్సుకి సహజంగా బహిర్ముఖం అయ్యే అలవాటు ఉంది. ఎంచేతంటే అది ప్రకృతి కాబట్టి. ఒక పంచభూతాలే ప్రకృతి కాదు. మనస్సు ప్రకృతి, అహంకారం ప్రకృతి, ఈ బుద్ధి ప్రకృతి, ఇదంతా ప్రకృతి మయం అన్నాడు భగవంతుడు వాసుదేవ స్వామి.

**మనస్సుకు లోచూపు నేర్పు. మనస్సు దాని మూలమైన హృదయంలో అది నిలబడి ఉండేటట్లు చూడు. హృదయంలో మనస్సును ఉంచటం వలన అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది. అప్పుడు అక్కడ ఉన్న సత్య వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది.**





# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

అందరికీ శాంతి కావాలి. ఈ సంసారం నడవటానికి, శరీర పోషణకి, ఎంతోకొంత పైసాలు ఎలా కావాలో, అదేవిధంగా అందరి మనసుకీ శాంతి కావాలి. ఎంత సంపద ఉన్నా, శాంతి లేని వాడికి సుఖము లేదు. అంచేత నాకు శాంతి అక్కరలేదు అని చెప్పేవాడు లేడు. మన స్వరూపంలో ఉన్నది శాంతే. ఎవరికి శాంతి కలుగుతుంది అని భగవాన్ ప్రశ్న వేసి ఆయనే సమాధానం చెపుతున్నాడు.

**భోక్తారం యజ్ఞ తపసాం సర్వ లోక మహేశ్వరం ।**

**సుహృదం సర్వ భూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి॥ శ్లోకం 5-29**

తాత్పర్యము: భగవంతుడు యజ్ఞములకును, తపస్సులకును భోక్త. సమస్త లోకములకును, లోకేశ్వరులకును అధిపతి. సమస్త ప్రాణులకును ఆత్మీయుడు, అనగా అవ్యాజదయాళువు. పరమప్రేమ స్వరూపుడు. ఈ భగవత్తత్త్వము ఎరిగిన భక్తులకు శాంతి లభించును.

భోక్తారం యజ్ఞ తపసాం - అంటే మోక్షం పొందటానికి నువ్వు చేసే తపస్సులకి, నువ్వు చేసే యజ్ఞాలకి, నేను భోక్తగా ఉంటాను. భగవద్గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే కీర్తికాంక్ష లేకుండా, ప్రతిఫలం పట్ల కాంక్ష లేకుండా, గుర్తింపులు కోరుకోకుండా, నువ్వు సహృదయంతోటి సద్బుద్ధి తోటి ఏ మంచి పని చేసినా, అది యజ్ఞం తోటి సమానము. అదిచిన్న పనా పెద్ద పనా అని కాదు, నువ్వు చేసేటప్పుడు ఎటువంటి బుద్ధి తోటి చేస్తున్నావు, స్వార్థంతో చేస్తున్నావా, స్వార్థం లేకుండా చేస్తున్నావా? నువ్వు చేసేది ఎంత చిన్న పని

అయినా సరే, అక్కడ అవసరాన్ని బట్టి సహృదయంతోటి చెయ్యి, సద్బుద్ధి తోటి చెయ్యి అది యజ్ఞం తోటి సమానం.

తపస్సు అంటే ఎక్కడికో, ఏ హిమాలయ పర్వతాలకో పారిపోవటం కాదు. తపస్సు అంటే మీ మనస్సుని ఎండింప చేసేది. మీరు శరీరంతోటి, మాటతోటి, మనస్సు తోటి తపస్సు చెయ్యవచ్చు. శరీరంతోటి ఏమైనా మంచి పనులు మీరు చేస్తూ ఉంటే, అది శారీరక తపస్సు. మాటకి కూడా శక్తి ఉంటుంది. కొన్ని వాక్యాలు మనం వింటే, నీళ్ళు వేస్తే నిప్పు ఎలా ఆరిపోతుందో, మీ దుఃఖమనే మంట అలా వెంటనే ఆరిపోతుంది. ఇతరులకి ఉపయోగపడే మాటలు, ఇతరుల యొక్క చైతన్య స్థాయి పెంచే మాటలు, ఇతరుల దుఃఖము ఆర్పే మాటలు, మీ హృదయంలోంచి వస్తూ ఉంటే, అనేక మందికి అశాంతి ఆరిపోతుంది. అది వాక్కు తపస్సు. మనస్సులో మీకు వచ్చే తలంపులలో ఎవరికీ మీరు అపకారం కోరకూడదు, ఎవరికీ కీడు కోరకూడదు. ఒకవేళ భౌతికంగా ఎవరికీ మీరు సహాయం చెయ్యలేకపోయినా, వారు సుఖంగా ఉండాలి, క్షేమంగా ఉండాలి అని వాళ్ళ శ్రేయస్సు అన్నా మీరు కోరుకోవాలి. అది మానసిక తపస్సు.

కర్మ అంటే పని. పని మూడు రకాలుగా చేసుకోవాలి. ఒకటి మీరు సంసారంలో ఉన్నారు కాబట్టి, సంసారానికి ఉపయోగపడే పని. రెండు, సమాజానికి ఏమైనా ఉపయోగపడితే, అంతవరకూ సమాజానికి ఉపయోగపడే పని. మూడు, మోక్షం సంపాదించటానికి; అంటే మీకు జీవితగమ్యం అయినటువంటి ఆత్మజ్ఞానం సంపాదించటానికి మీరు చేసే సాధన. ఇవన్నీ కూడా కర్మ లోకే వస్తాయి.

భగవంతుడు ఏ పనులు చేయకూడదు అని చెప్పాడో, ఆ పని వదిలేయాలి. దాన్ని నిషిద్ధ కర్మ అంటారు. ఏ పని చేస్తే భవిష్యత్తులో దుఃఖం వస్తుందో, ఏ కర్మ చేస్తే మీకు అశాంతి వస్తుందో, ఏ కర్మ చేస్తే మీరు పాడులోకాలకి వెళ్తారో, ఆ కర్మ చెయ్యవద్దని చెపుతూ మీరు చెయ్యకూడని పనులు అని భగవద్గీతలో ఒక లిస్టు ఇచ్చాడు. మనం సత్కర్మ చేసినా చెయ్యకపోయినా, చెయ్యకూడని పనులకి మనం వెళ్ళకూడదు.

తరువాత నిగ్రహం నేర్చుకోవాలి. మాటలో, మనస్సులో, మీరు చేసే పనిలో కూడా నిగ్రహం ఉండాలి. ఇతరులకి అపకారం చేసే శక్తి మీకు ఉన్నప్పటికీ కూడా మీరు అపకారం చెయ్యకూడదు. ఎందుచేతనంటే భగవంతుడు అది పనికిరాదు అని చెప్పాడు. అది మీరు

గుర్తుపెట్టుకోండి.

ఎదుటి వాళ్ళను విమర్శించే ముందు నువ్వు ఆత్మవిమర్శన చేసుకోవాలి. సర్వసాధారణంగా మానవుడిలో ఉన్న లోపం ఏమిటంటే - ఆత్మస్తుతి పరనింద. మనిషి తనని తాను స్తోత్రం చేసుకుంటాడు, ఇతరులని విమర్శిస్తాడు. ఇవి రెండూ కూడా ఆత్మ జ్ఞానానికి అడ్డు వస్తాయి. జీవితగమ్యం మోక్షాన్ని పొందటం, అలౌకిక శాంతిని పొందటం. నువ్వు ఆత్మ జ్ఞానం సంపాదించాలంటే, దానికి అనుగుణంగా నీ మాట చేత ఉండాలి.

భోక్తారం - నువ్వు ఏదైనా ఒక మంచి మాట మాట్లాడితే, చేతితోటి ఒక మంచి పని చేస్తే, నువ్వు ప్రాక్టికల్ గా ఎదుటివాళ్ళకి ఉపకారం చెయ్యకపోయినా, వాళ్ళ క్షేమం కనుక నువ్వు కోరితే, అందులో నేను వాటా తీసుకుంటాను. వాటా తీసుకొని నీకు ప్రతిఫలం ఇచ్చే భాధ్యత నాది అని పరమాత్మ అంటున్నాడు. నువ్వు చేసే మంచి పనికి నేను సహకారిగా ఉంటాను. నేను అది స్వీకరించి తిరిగి నీకు ప్రతిఫలం ఇస్తాను.

నేను ఎటువంటి వాడిని అనుకొంటున్నావు? సర్వలోక మహేశ్వరం - కనిపిస్తున్న ఈ లోకాలు అన్నింటికీ అధిపతిని నేనే! నీకు అర్థం అయినా, అర్థం కాకపోయినా, ఈ కనిపిస్తున్న ఈ లోకమే కాదు, స్వర్గలోకం, నరకలోకం, భూలోకం, అన్ని లోకాలకీ అధిపతిని నేనే. అంతమాత్రమే కాదు, ఈ లోకాలని పరిపాలించే దేవతలకి కూడా అధిపతిని నేనే! నువ్వు చేసిన మంచి పని లోకం గుర్తించినా గుర్తించక పోయినా, నేను గుర్తించి, నిన్ను మోక్ష సామ్రాజ్యానికి, శాంతి సామ్రాజ్యానికి అధిపతిని చేస్తాను. భగవంతుడికి అసాధ్యమంటూ ఏదీ లేదు. వాడు అంతర్యామిగా ఉన్నాడు. జీవకోటిని వాళ్ళ దేహం యొక్క ప్రారబ్ధాన్ని బట్టి తోలుకెళ్ళే వాడిని నేనే. నువ్వు తల్లి కడుపులోంచి బయటికి వచ్చాక వల్లకాటిలోకి వెళ్ళేవరకూ, పశువుని వెనకాల కర్ర పుచ్చుకొని ఎలా తోలుకు వెళ్తారో, నీ దేహం యొక్క కర్మానుసారం నీకు అంతర్యామిగా ఉన్న నారాయణుడు తోలుకు వెళ్తా ఉంటాడు. వాడిని కాదని నువ్వు ఏమీ చెయ్యలేవు. మీకు అనేక ప్రణాళికలు ఉండవచ్చు, ఆ ఈశ్వరుడి యొక్క ప్రణాళికని బట్టే మీ దేహాల్ని తోలుకు వెళ్తా ఉంటాడు. ఆత్మబుద్ధి లేకుండా దేహబుద్ధి ఉన్నవాడు ప్రతీవాడు పశువే. ఈ పశువులకి పతి శివుడు. శివుడికి పశుపతి అని పేరు.

ప్రతీ మనిషిలోనూ లోపం ఏమిటంటే, మన హృదయంలో అంతర్యామిగా ఉన్న నారాయణుడికి మనం దూరంగా ఉంటాము, లోకానికి దగ్గరగా ఉంటాము. నారాయణుడు

అనే వాడు ఒకడు ఉన్నాడు; ఆయనే మన కర్మఫల దాత, మనల్ని అజ్ఞానం లోంచి విడుదలచేసి అనుగ్రహించటానికి దయ చూపించటానికి సిద్ధంగా ఉన్నాడు అనేటటువంటి విశ్వాసం కూడా లేని విశ్వాసహీనులం. మనం దేవుని యొక్క అనుగ్రహం కోసం పని చేయము, లోకంలో గుర్తింపుల కోసం పని చేస్తాము. అందుచేత ఆజన్మకాజన్మలోకానికి శరీరానికి బంధించబడి పోతున్నాము కాని, చైతన్యం యొక్క సమీపం లోకి, భగవంతుడి యొక్క సమీపంలోకి వెళ్ళటం లేదు. ఎక్కడో గుళ్ళో దేవుడు ఉన్నాడు అనుకొంటున్నాము కాని, మన హృదయంలో అంతర్యామిగా నారాయణుడు, ఉన్నాడు అనే గుర్తింపు లేని వాళ్ళం మనం. ఇతరులు మాట వదిలేయండి, భక్తులు కూడా అంతే. ఎందుచేతనంటే ఈ భక్తులు అందరూ కూడా లౌకికులు. మనం లోకంలో భక్తుల కింద చెలామణీ అవ్వచ్చు, కాని భగవంతుడు అనుకోవాలి కదా వీళ్ళు మన భక్తులు అని!

సుహృదం సర్వభూతానాం - ఈ సృష్టిలో నాకంటే మీ క్షేమం కోరేవాళ్ళు ఎవరైనా ఉన్నారా అంటున్నాడు పరమాత్మ. ఐ యామ్ యువర్ ఫ్రెండ్, ఐ యామ్ యువర్ హెల్పర్! అర్జునా, నీ మంచి నా కంటే ఎక్కువ కోరేవాడు, నీ చుట్టాల్లో కాని స్నేహితులలో కాని ఎవరైనా ఉన్నారా! మీ క్షేమం నేను కోరుతున్నాను కాబట్టి ఈ శాస్త్రం మీకు చెపుతున్నాను. మీ బుద్ధికి అందని విషయాలు మీ ఇంద్రియాలకి అందని విషయాలు చెప్పి, వాస్తవ పరిస్థితిలోకి, అంటే ఆ పరమాత్మ లోకి మీ కళ్ళు తెరిపించటానికి శాస్త్రం అవసరం. నేను మీ క్షేమం కోరకపోతే ఈ శాస్త్రం చెప్పవలసిన పనేముంది! ప్రపంచంలో భగవంతుడిని ద్వేషించేవాళ్ళు, భగవంతుడు లేడు అని చెప్పేవాళ్ళు అనేక మంది ఉండవచ్చు; వాళ్ళ యోగక్షేమాలు కోరటం నేను మానను. వాళ్ళ క్షేమం కూడా నేను కోరుతూనే ఉంటాను.

మీ తల్లితండ్రులకి సంపద ఉంటే మీకు బట్టలు కారు కొనిస్తారు. మీకుఉన్న చెడ్డ అలవాట్లలోనుంచి కాని, మీకుఉన్న అసూయ బుద్ధిలోనుంచి కాని మీ తల్లితండ్రులు మిమ్మల్ని విడిపించగలరా? దురాలోచనలోనుంచి, ఆ దుర్బుద్ధిలోనుంచి నిన్ను విడుదల చేసేవాడు నీకు చుట్టమా! ఊరికే లౌకికమైన మాటలు చెప్పేవాడు నీకు చుట్టమా! ఇలా మనకి అర్థమయ్యే భాషలో చెపుతున్నాడు, కాని ఈ అల్పబుద్ధి గలవాళ్ళకి, స్వల్పబుద్ధి గల వాళ్లకి చిన్న చిన్న మాటలతోటి చెప్పినా మనకి బుద్ధి రావటం లేదు.

పరమేశ్వరుడి లీల ఎలా ఉంటుందో మనకి గుర్తింపు రావటానికి చిత్తశుద్ధి, చిత్త

ఏకాగ్రత, వివేకము, వైరాగ్యము ఈ నాలుగు లక్షణాలు మీరు అలవాటు చేసుకోండి. డబ్బు ఉంటే మంచిదే, డబ్బు లేని వాళ్ళు సంపాదించు కొంటున్నారు కదా. అలాగే ఈ నాలుగు లక్షణాలు మీకు ఉంటే మంచిదే, లేకపోతే సంపాదించుకోండి.

వివేకము అంటే విడదీసుకొనే బుద్ధి - ఈ మాట మనకు ఎంతవరకూ ఉపయోగ పడుతుంది, ఎంతవరకూ ఉపయోగపడదు. వీళ్ళు మన క్షేమం కోరి చెపుతున్నారా, క్షేమం కోరకుండా చెపుతున్నారా? ఆ విడదీసుకునే బుద్ధి మనకి ఉండాలి. సొంతబుద్ధి లేకుండా ఎవరు ఏది చెపితే దానికి తల ఊపే వాళ్ళని ఎత్తువారి చేతి బిడ్డలు అంటారు. వాళ్లకి పరాయిబుద్ధే కాని సొంతబుద్ధి ఉండదు. నీ క్షేమం కోరేవాడు ఎవరో గుర్తించే వివేకం నీకు ఉండాలి. ఎవరైనా మనమీద అసూయ తోటి మాట్లాడుతున్నారు అని స్పష్టంగా మనకి అర్థం అవుతున్నప్పటికీ మనకి తెలియనట్టు నటించి, మామూలుగానే వాళ్లని ప్రేమించటం నేర్చుకోవాలి. అప్పుడు ప్రమాదంలో పడకుండా ఉంటాము. వాళ్ళు అసూయతోటి మాట్లాడుతున్నారు అని మనం అస్తమానూ అనుకొంటే, వాళ్ళకి ఏ చెడ్డ అలవాటు ఉందో, ఆ అసూయ మనకి కూడా వచ్చేస్తుంది. చివరిగా ఏంచెప్పాడు వైరాగ్యం. వైరాగ్యం కనుక లేకపోతే మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. మీకు అనేక మంది బంధువులు ఉన్నారు. కాని మీ మనస్సుని మీరే బాగుచేసుకోవాలి. మీ మనస్సుని బాగుచేసుకోవటానికి ప్రయత్నం అంటూ మీరు మొదలు పెడితే, పరమాత్మ సహాయ సహకారాలు మీకు మెండుగా వస్తాయి.

భగవంతుడు అంతర్యామి. మీకు, అన్ని లోకాలకి, దేవతలకి, అందరికీ ఆధారంగా ఉన్నటువంటి పురుషోత్తముడు ఆయనే. ఆయనే పరమపురుషుడు, నారాయణుడు! ఈ సృష్టి అంతా ఆయన ఆజ్ఞ మేరకే నడుస్తోంది, ఆయన సంకల్పానికి విరుద్ధంగా ఈ సృష్టిలో ఏదీ జరగటం లేదు. అది తెలియక పోవటం వల్ల మీకు అశాంతి వస్తోంది. ఎవరింటికి వెళ్ళినా మాకు శాంతి లేదు మాకు శాంతి లేదు అని చెప్పేవాళ్ళే! మీరు యోగాలు తపస్సులూ మాట అటుంచండి, భగవంతుడు ఇట్టివాడు అని ఒక అవగాహన మీకు లేదు, ఆయనపట్ల మీకు పరిపూర్ణమైన విశ్వాసము లేదు కాబట్టి మీకు శాంతి కూడా దొరకటంలేదు. కాని, నేను చెప్పిన సబ్జెక్టు అంతా మీకు అర్థం అవుతావుంటే ఉన్నది శాంతే కదా అంటున్నాడు పరమాత్మ.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

# సత్యజ్ఞానం

త్రాడే దూరం నుంచి చూసినప్పుడు భ్రాంతి కారణంగా పాములాగా కనిపించినట్లుగానే, తానే అయిన అఖండ, అద్వయ ఆత్మలో, మాయచేత జీవభ్రాంతి కల్పింపబడుతోంది. మానవునికి వాస్తవంగా తాను ఎవరో? అనుభవైకవేద్యం అయినప్పుడు జీవభ్రాంతి నశించి, స్వస్వరూపానుభూతి కలుగుతుంది. దేహభ్రాంతి వల్ల, కేవల బ్రహ్మమునే జీవుడిగా పొరబడుతున్నాము. అనగా అజ్ఞానం వల్లనే, అసత్యమైన జీవభావన ఉదయిస్తోంది. సత్యజ్ఞానం కలిగితే నేను, నాదితో సహా సర్వ భ్రాంతులు తొలగి, ఏకత్వం సిద్ధిస్తుంది. అజ్ఞానం నశించాలంటే, దానికి జ్ఞానమే విరుగుడు. అహంకారం వల్లనే మనము, మనదైన సహజస్థితికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ ఉంటాము. పచ్చకామెర్లు వచ్చినప్పుడు లోకాన్నంతా పచ్చగా చూసినట్లు, మనస్సు వల్ల, ప్రపంచాన్ని ఆత్మ కన్న వేరుగా, వికారాలతో కూడిన దానిగా చూస్తూ ఉంటాము. రాగద్వేషాలు, సుఖదుఃఖాలు వంటి ద్వంద్వాలు మనస్సుకి సంబంధించినవే! ఆత్మ వాటికి అతీతం. చీకటిలో ఉన్న వస్తువును చూడడానికి దీపం అవసరం అవుతుంది కాని, ఆ దీపాన్ని చూడడానికి ఇంకొక దీపం అవసరం లేదు. అదేవిధముగా జ్ఞాన స్వరూపమైన ఆత్మ జడములైన దేహేంద్రియ మనోబుద్ధులను ప్రకాశింపచేస్తూ ఉండగా, ఆ జ్ఞానప్రకాశాన్ని, ఆత్మను, దర్శింపచేయడానికి ఇంకొక జ్ఞానం అవసరం లేదు. ఆత్మ పూర్ణజ్ఞాన స్వరూపం. ఆత్మ వల్లే సకలము తెలుస్తున్నాయి. అట్టి ఆత్మను తానుగా తెలుసుకొని, ఆత్మగా జీవించడమే నిజమైన జ్ఞానం. ఆత్మే, గురువై జ్ఞాన ద్వారాన్ని తెరుస్తుంది. మానవుని సకల అరిష్టాలకు కారణమైన దేహాత్మబుద్ధి వల్ల, కేవలం ఉన్న దానిని ఉన్నట్లుగా చూడలేక భ్రాంతిలో పడుతున్నాము. అట్టి దేహాత్మ బుద్ధి నుండి విడుదల పొందుటయే సకల సాధనల గమ్యము.

**ఓం తత్ సత్**

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

# అసంఖ్యాకంగా చూచే దృష్టే ద్వైతం - ఏకంగా చూచే దృష్టే అద్వైతం

ఈ ప్రపంచ స్వప్నము నుంచి మేల్కొన్న వానికి మిగిలేది ఎరుకే అదే అద్వైతం. ఈ ప్రపంచాన్ని చూస్తున్నాను అని చెప్పటం కూడా ద్వైతమే. అది కంటితో చూసేది నిత్యం దాన్ని చూస్తున్నాను అనటం వల్ల అద్వైతంలో నమ్మకం కుదరటం లేదు. శాస్త్రమూలంగా ఆ విషయాలు తెలుసుకోవాలి. బేధబుద్ధితో ఉన్నంతకాలం దుఃఖం ఉంటుంది. రెండవ వస్తువు ఉన్నంతకాలం దుఃఖం తప్పదు. వస్తు వియోగంతో దుఃఖం వస్తుంది. మనస్సు యొక్క సాయంతో ఆత్మను చూడలేము. ఆత్మ సాయంతోనే మనస్సు ఆలోచిస్తుంది. దాని వెలుగులోనే అది బ్రతుకుతుంది. కానీ ఏకాగ్ర భక్తితో నామజపం చేస్తే జీవితంలో పారమార్థిక ప్రయోజనం నిస్సందేహంగా కలుగుతుంది. నేను ఈ పని చేసినందువల్లనే ఈ సుఖం అనుభవిస్తున్నాను అనే భావన నశించిన వెంటనే శాంతి మిగులుతుంది. ఆ నిశ్చల చిత్తమే ముక్తిని కలుగజేస్తుంది. మనకు మనమే విలాసంగా అతడు నేను - ఇతడు అనే మాటలతో నిరంతరం వ్యవహరించబడుతూ మెచ్చుకుంటున్నాము. ఇది అంతా దేహభావన వల్ల వచ్చే సంకటాలు భగవాన్ 'నేను' అనే మాటను అవతలవానికి విషయం తెలియటానికి తప్పని సందర్భంలోనే వాడేవారు. శ్రీనాన్నగారు 'మనకు నీళ్ళ వాడకం కంటే 'నేను' అనే మాటే ఎక్కువగా వాడుకొంటున్నాము' అనేవారు. సంకల్పం వల్లనే ఈ జగత్తు కల్పించుకొంటున్నాము. గాఢనిద్రలో అది లేదు, ఇది సత్యం కాదు. స్వప్నములో వలె ఆవిర్భవించింది. మొదట సాధకుడు ఇంద్రియాలను వశం చేసుకోవాలి. మనస్సును అభ్యాసంతో విచారణామార్గంలో పెట్టాలి. దీనికి పురుషప్రయత్నం తప్ప మరో ఉపాయం లేదు. బహిర్ముఖ చేటు, అది మూఢత్వము. అట్టి మూఢత్వం నశిస్తే సత్యానుభవానికి పూర్ణంగా ఆవిష్కరించుకోవచ్చును. ప్రతీవానికీ కొన్ని బలహీనతలు ఉంటాయి. దాని వల్ల కలిగే నష్టాలను మననం చేసుకొంటూ మన గమ్యమైన ఆత్మానుభవాన్ని పొందాలి అదే జీవిత గమ్యము. రూప సౌందర్యంతో మెరిసిపోతున్న స్త్రీని ఆత్మ జ్ఞాని అది కేవలం వంచన పంచభూతాలతో నిర్మించబడ్డ లిఖించిన చిత్రమే అని వాటికి ఏ విలువ లేదని భాసిస్తూ నిర్లిప్తంగా ఉంటాడు సాధకుడు ఆ జ్ఞానం అనుభవంలోకి తెచ్చుకొంటే మన దృష్టి అంతా అద్వైతం అవుతుందని అనుభవజ్ఞులు తెలుపుతారు. విషబీజాలు నాటి అమృత ఫలాలు వస్తాయని ఆశించకూడదు. విషయాలు మరింత విషాన్ని ఇస్తుంది. అమృతబీజం అమృతఫలాన్ని ఇస్తుంది. కోరిక ఒకటిగా ఉండదు. వెయ్యి కోరికలు అల్లరి చేస్తూ మనలను వెనక్కు ముందుకు లాగుతాయి అన్ని వైపులకు అలా లాగటం వల్ల మనం మాయలో పడిపోతాము. మౌనంలోనే స్వేచ్ఛను తెలుసుకోవాలి. మనం ఎవరిమో, ఏది నిజంగా ఉందో మనం తెలుసుకోలేము. అద్వైతాన్ని తెలుసుకోనంతకాలం నీవు - నేను అనే సిద్ధాంతాలకు వేల్లాడటం కొనసాగుతూనే ఉంటాము మన కలల భ్రమలతో నిస్సారమైన బ్రతుకు కొనసాగిస్తాము. లీలను అంతం చేసి నిత్యాన్ని పొందాలి. దానికి గురుకరుణ ప్రధానం.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966